క్లుప్తంగా

'డబుల్' సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్‌రూం వాసులు

ఖమ్మంమయూరిసెంటర్: వర్షానికి డబుల్ బెడ్‌రూం సముదాయం భవనంపై నీళ్లు నిలిచి కురుస్తుందని, కనీస మౌలిక సదుపాయాలు లేవని నగరంలోని 1వ డివిజన్ మల్లెమడుగు రెండు పడకగదుల గృహ సముదాయ వాసులు శనివారం ఆందోళన చేపట్టారు. నాణ్యత లేకుండా గృహాలను నిర్మించడంతో చిన్న వర్షాలకే నీళ్లు నిలిచి కురుస్తుందని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం సముదాయానికి వచ్చేందుకు సరైన మార్గం లేక డంపింగ్‌యార్డ్ నుంచి రావాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. తమకు రోడ్డు సదుపాయం కల్పించాలని, కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

పేద మహిళకు కుట్టు మిషన్ వితరణ



కుట్టుమిషన్‌ను అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన కల్లూరుకు చెందిన పేద మహిళ గొల్లమందాల వాణికి శనివారం ఓ కుట్టుమిషన్‌ను అందించారు. ఖమ్మంలో నిర్వహించిన రూ.7 వేల విలువ చేసే ఈ కుట్టుమిషన్ అందజేత కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తల్లపురెడ్డి క్రిష్టారెడ్డి, కార్యదర్శి వేముల హన్మంతరావు, జోన్ చైర్మన్ డాక్టర్ డీపీసీ రావు, గెల్లా శ్రీరామ్, వెంకయ్య, నాగేశ్వరరావు, అబ్దుల్ అలీమ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులందరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ వర్తింపచేయాలి

ఖమ్మంలీగల్: ఈ నెలలో కాలపరిమితి తీరనున్న న్యాయవాదుల గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని 2019 సంవత్సరం తర్వాత వృత్తిలోకి వచ్చిన న్యాయవాదులందరికీ వర్తింపచేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఏఐఎల్‌యూ) బాధ్యులు కోరారు. ఈ సందర్భంగా ఏఐఎల్‌యూ ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో న్యాయ శాఖ కార్యదర్శి ఆర్.తిరుపతిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీలోని న్యాయవాదుల జాబితాను సరిచేయాలని, మృతి చెందిన వారి పేర్లు తొలగించి, యువ న్యాయవాదుల పేర్లు చేర్చాలని కోరారు. వయో పరిమితి విధించకుండా న్యాయవాదులందరికీ బీమా సౌకర్యం వర్తింపజేయాలన్నారు. అంతేకాక తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ నుంచి న్యాయవాదులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య ఖర్చుల పరిమితిని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని, నెట్‌వర్క్ ఆస్పత్రుల జాబితాలో జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులను జత చేయాలన్నారు. న్యాయశాఖ కార్యదర్శిని కలిసిన వారిలో ఏఐఎల్‌యూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి.విద్యాసాగర్, అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణతో పాటు ఇ.వేణుగోపాల్, చందాల శైలజ, ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, రమేష్‌కుమార్ మక్కడ్, పి.కిషన్‌రావు, ఎం.శంకరయ్య, వై.మంజులత తదితరులు ఉన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	5
వంకాయ	26		20
బెండకాయ	30	పాలకూర	2
పచ్చిమిర్చి	88		10
కాకర	60	చుక్కకూర	2
బీర	70		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	110	గోంగూర	2
గోరుచిక్కుడు	50		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	36	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం

వినూత్నం.. విజయం!



ఓ ఆలోచన వాహనదారుల ఇబ్బందులను తొలగించిందనే చెప్పాలి. ఒకప్పుడు వాహనాల టైర్లు పంక్చరైతే ఆ వాహనదారుడు పంక్చర్ వేయించేందుకు పడరాని పాట్లు పడాల్సి వచ్చేది. అలాంటి వారి కష్టాలను తీర్చాలనే ఓ షాపు నిర్వాహకుడు వినూత్నంగా ఆలోచించి మొబైల్ పంక్చర్ ఏర్పాటు చేశారు. ఎక్కడికంటే అక్కడికి వెళ్లేలా సుమారు రూ.5లక్షలతో తన బిజినెస్ మొదలు పెట్టి పంక్చర్ ఖరీదుతో పాటు దూరాన్ని బట్టి మహన చార్జ్ చేస్తున్నాడు. దీంతో వాహనదారుల కష్టాలను కొంతమేర తీరుస్తుందనే చెప్పొచ్చు.



మొబైల్ పంక్చర్ వాహనం ద్వారా లారీ టైర్లకు పంక్చర్ వేసి ఎక్కిస్తున్న దృశ్యం

మొబైల్ పంక్చర్ ఆలోచన అదుర్స్..

- తీరుతున్న వాహనదారుల ఇబ్బందులు
- ఆలోచన ఖర్చు సుమారు రూ.5 లక్షలు
- పంక్చర్‌తో పాటు దూరాన్ని బట్టి చార్జ్ చేస్తున్న నిర్వాహకులు
- పలువురికి ఉపాధి కల్పిస్తున్న వైనం

సండే స్పెషల్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని నూతన బస్టాండ్ సమీపానికి చెందిన ఎస్‌కె.మౌలానా బైపాస్ రోడ్డులో సుమారు పదేళ్లుగా టేకులపల్లి బ్రిడ్జి సమీపాన పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. కొన్ని కారణాల వల్ల షాపును తొలగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో సుమారు ఏడాది క్రితం బైపాస్ రోడ్డులోని పీజీ కళాశాల సమీపాన ఓ పంక్చర్ షాపును ఏర్పాటు చేశారు. గతం కంటే వాహనదారులు పంక్చర్ వేపించుకునేందుకు సుదూర ప్రాంతమని రాకపోవడంతో కొంత ఇబ్బందులు పడి.. చివరకు తన సమస్యను అధిగమించాలని ఆలోచనలో పడ్డాడు. ఈ క్రమంలోనే మొబైల్ పంక్చర్ ఐడియా వచ్చి అమలు చేశాడు.

రూ.5 లక్షల ఖర్చుతో..

హుస్సేన్ మొబైల్ పంక్చర్‌ను ఏర్పాటు చేయాలనుకున్న సమయాన కావాల్సిన వస్తువులపై దృష్టి సారించాడు. ఈక్రమంలో ఒక పాత టాటా ఏసీ వాహనాన్ని కొనుగోలు చేసి దానిపై గాలి మిషన్, దానికి అవసరమైన ఆయిల్ ఇంజిన్, ఒక నీళ్ల డ్రమ్ము, పంక్చర్లు వేసేందుకు కావాల్సిన సామగ్రిని ఏర్పాటు చేశారు. దీనికి సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చయిందని నిర్వాహకులు తెలిపారు.

ఎక్కడికంటే అక్కడికి..

బైపాస్ రోడ్‌లో నిత్యం లారీల రాకపోకలు అధికంగా సాగుతుంటాయి. ఒక్కోసారి నగరంతో పాటు నగర శివార్లు, నగరానికి సమీప ప్రాంతాల్లో లారీల టైర్లు పంక్చరై ఆగిపోతుంటాయి. ఒక్కోసారి లోడ్ లారీకి పంక్చరైతే ఆ డ్రైవర్ తిప్పలు అంతా ఇంతా కావు. అలాంటి వారికి ఈ వాహనం సులభంగా ఉపయోగపడుతుంది. పంక్చర్ ఖరీదుతో పాటు దూరం, వాహనాన్ని బట్టి చార్జ్ తీసుకుంటున్నట్లు నిర్వాహకుడు మౌలానా తెలిపారు. అయితే ఈ బిజినెస్‌లో కొద్దిమంది లారీల వారితో పాత పరిచయాలు ఉండడం, ఇంకొంత మంది వాహనాలకు పంక్చర్లు వేసేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలు సుదూరమైనప్పటికీ వెళ్లి వస్తున్న క్రమంలో వివిధ ప్రాంతాల్లో పంక్చరైన వారు సంప్రదిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ వాహనానికి ఒక వర్కర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఆయనకు ఉపాధి చూపించినట్లవుతుండడంతో పాటు తనకు సైతం కొంత వ్యాపారం సాగుతున్నట్లు పేర్కొంటున్నారు.

కొత్తగా ఆలోచించా..



నేను మొదటి నుంచి వాహనాలకు పంక్చర్లు వేసేవాణ్ని. కొన్ని రోజుల తర్వాత దుకాణాన్ని మార్చాల్సి రావడంతో కస్టమర్లు తగ్గిపోయారు. దీంతో ఇబ్బందులు రాగా ఇలా మొబైల్ పంక్చర్ ఐడియా వచ్చింది. దీనికి కావాల్సిన సామగ్రిని కొని సుమారు ఏడాది కాలంగా బిజినెస్ రన్ చేస్తున్నా. మంచిగా అనిపిస్తుంది.

– ఎస్‌కె.మౌలానా, మొబైల్ పంక్చర్ నిర్వాహకుడు

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

నేలకొండపల్లి: ఈ నెల 27న జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈమేరకు శనివారం స్థానిక తహసీల్‌లో ఆయా పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలకు పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేశారు. కాగా, నేలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ గౌరీశంకర్ పరిశీలించి కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌరీశంకర్

మాజీ ఎమ్మెల్యే కందాల ఆర్థిక సాయం

తిరుమలాయపాలెం: మండలంలోని రాజారం గ్రామంలో గడ్డి మందు కొట్టిన పెసర పంటను మేసిన గొర్రెలు మృత్యువాత పడి గొర్రెల కాపారులు తీవ్రంగా నష్టపోవడంతో పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. శనివారం గొర్రెల కాపారుల కుటుంబాలతో మాజీ ఎమ్మెల్యే కందాల వీడియో కాల్‌లో మాట్లాడారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈమేరకు స్థానిక నాయకుల ద్వారా ఒక్కో గొర్రెకు రూ.వెయ్యి చొప్పున రూ.2లక్షల ఆర్థిక సాయంగా అందించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు నష్ట పరిహారం అందేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాణాల మధుసూదన్‌రెడ్డి, వేల్పుల మల్లయ్య, గొర్రెల కాపారులు కొమరయ్య, పేర్ల సంపత్, పేర్ల గణేష్, నరేష్ పాల్గొన్నారు.



వీడియో కాల్‌లో మాట్లాడుతున్న కందాల

కార్గో సిబ్బంది నిర్లక్ష్యం..

- పార్శిళ్లను భద్రపర్చడంలో వైఫల్యం
- వర్షానికి తడిసిపోతున్నా పట్టించుకోని సిబ్బంది
- ఆందోళనలో వినియోగదారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ కార్గో సిబ్బంది నిర్లక్ష్యంతో వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. తమ పార్శిళ్లను భద్రంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన సిబ్బంది తమకు పట్టనట్లుగా కార్గో పాయింట్‌లో పడేయడాన్ని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం నూతన బస్టాండ్‌లో కార్గో పాయింట్ వద్ద పార్శిళ్లను ఇష్టానుసారంగా బయట పడేస్తుండడంతో గత రెండు రోజులుగా ఖమ్మంలో కురుస్తున్న వర్షానికి పార్శిళ్లు తడిసి పాడవుతున్నాయి. శనివారం ఉదయం ఒక్కసారిగా వర్షం రావడంతో కార్గో పాయింట్‌లో బయట ఉన్న పార్శిళ్లు చాలా వరకు తడిసిపోయాయి. దీంతో అక్కడే ఉన్న వినియోగదారులు సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రశ్నించగా.. కొన్నింటిని లోపలకు సర్దారు. రూ.వేల సామగ్రిని భద్రపరచడంలో విఫలమైన కార్గో సిబ్బందిపై వినియోగదారులు ఫైరయ్యారు. పార్శిల్ బుక్ చేసిన దగ్గర నుంచి డెలివరీ అయ్యేంత వరకూ భద్రంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కొత్త బస్టాండ్‌లో వర్షానికి తడుస్తున్న పార్శిళ్లు

పార్టీలకతీతంగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

ఖమ్మంవన్‌టౌన్: నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని తన గళం ద్వారా ప్రశ్నిస్తూ ప్రజలకు అండగా నిలిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శెట్టి రంగారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి కాంగ్రెస్ పార్టీని అధికారంలో తేవడంలో ఆయన చేసిన కృషి మరవలేనిదని, అలాంటి వ్యక్తిని వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉమ్మడి ఖమ్మం జిల్లా సత్తా చాటాలని ఓటర్లకు సూచించారు.

ప్రజా గొంతుక మల్లన్న..

ఖమ్మం మామిళ్లగూడెం: సుదీర్ఘ కాలం జర్నలిస్టుగా పనిచేసి ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రశ్నించే గొంతుకగా పోరాడి ప్రజల పక్షాన నిలిచిన తీన్మార్ మల్లన్నను గెలిపించుకోవాలని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ కోరారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గ్రాడ్యుయేట్లు, ఉద్యోగులకు లింగాల విజ్ఞప్తి చేశారు.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేట గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు చింతోజు వెంకటాచారి (58) శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. వడ్రంగి వృత్తి చేస్తున్న వెంకటాచారి గురువారం గుండెపోటుకు గురికావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటాచారి మృతికి సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మండల నాయకులు అంగిరేకుల నరసయ్య, తుశ్మార్ నాగేశ్వరరావు, దాసరి మహేందర్, పుసులూరి వీరభద్రం, భూక్యా వెంకన్న, బోడ బాలు, బోడ ధర్మా, మట్ట కృష్ణారావు, తమ్మిర వెంకటరెడ్డి, దాసరి భద్రయ్య, మందడి ఇజ్రాయిల్, మాజీ సర్పంచ్ కరుణశ్రీ తదితరులు నివాళులర్పించారు.

వాసవీ అమ్మవారి జయంతి వేడుకలు



పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ బాలగంగాధర్‌తిలక్, భక్తులు

ఖమ్మంగాంధీచౌక్ : నగరంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాల్లో అమ్మవారి జయంతి దినోత్సవ వేడుకలను శనివారం ఆయా ఆలయ కమిటీలు సంప్రదాయ పద్ధతిలో జరుపుకున్నాయి. నగరంలోని ట్రంకు రోడ్‌లో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన అమ్మవారి జయంతి వేడుకల్లో ఆలయ చైర్మన్, ఖమ్మం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు యర్రం బాలగంగాధర్ తిలక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలియుగంలో అధర్మాన్ని నిర్మూలించేందుకు ధర్మాన్ని ప్రతిష్ఠించేందుకు అమ్మవారు అగ్ని ప్రవేశం చేసి ఆత్మార్పణ గావించారని అన్నారు. అనంతరం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. నగరంలోని గుట్టల బజార్‌లో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి జయంతి వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ మేళ్లచెరువు వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి దేవత అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న వెంకటేశ్వరరావు దంపతులు

మజ్జిగ పంపిణీ..

ఖమ్మంఅర్బన్: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా శనివారం వాసవీ క్లబ్ రోటరీనగర్ ఆధ్వర్యాన క్లబ్ అధ్యక్షుడు సోమ శేషగిరిరావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల హనుమంతరావు, కోశాధికారి తల్లాడ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందిరానగర్‌లో క్లబ్ తరఫున ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించడంతో పాటు నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, రోటరీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో మజ్జిక పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, క్యాబినెట్ కోశాధికారి మాశెట్టి వరప్రసాద్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు రాయల ఈశ్వరి, మాశెట్టి తిరుమలరావు, జిల్లా అధికారులు కొత్తూరు రమేష్, కొదుమూరు శ్రీనివాసరావు, జోన్ చైర్మన్ తేలుకుంట్ల ధనుంజయరావు, క్లబ్ సభ్యులు కేసా సత్యం, కేసా గురునాథం, పాలువాయి వెంకటేశ్వరరావు, మాశెట్టి వాసు, రంగా పురుషోత్తం, నూనె గోపాలరావు, కల్వకుంట్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్ సెంటర్‌లో మజ్జిగ పంపిణీ..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ కమాన్‌బజార్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-5 ఆపరేషన్స్ ఏఈ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఖాజీపురం, విజయలక్ష్మి ఆస్పత్రి, జీవీ మాల్, వల్లాలవారి వీధి, షాదీఖానా, బొమ్మన సెంటర్, అతిథి లాడ్జ్, శాంతి లాడ్జ్, వినోద థియేటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అదేవిధంగా నెహ్రూనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో పనుల కారణంగా రిక్కా బజార్, న్యూహోప్ ఆస్పత్రి, బిలీఫ్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రఘునాథపాలెం మండలంలో..

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి లచ్చిరాంతండా ఫీడర్ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లచ్చిరాంతండా, దొనబండ తదితర గ్రామాలకు కరెంట్ కోత విధించబడుతుందని మంచుకొండ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తత అవసరం

కామేపల్లి: రైతులు నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం డివిజన్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండలంలోని మద్దులపల్లి గ్రామంలో రైతులకు విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మట్టి నమూనా సేకరణ, వేసవి దుక్కులపై అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ప్రతీ విత్తన ప్యాకెట్‌కు సంబంధించిన రశీదులను తప్పకుండా తీసుకోవాలన్నారు. మట్టి నమూనాలు ఏ విధంగా సేకరించాలి, మట్టి పరీక్షా ఫలితాల వివరాలను వివరించారు. వేసవి దుక్కులు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, పంట అవశేషాలను తగులబెట్టడం ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఏఓ భూక్యా తారాదేవి, ఏఈఓ జగదీశ్వర్, ఉష, రైతులు అంబటి శ్రీనివాసరెడ్డి, గట్టికొప్పుల నారాయణరెడ్డి, పెద్ద సైదులు, మల్లయ్య, సంజీవరెడ్డి, కాత్రాల రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

విత్తనాలు సబ్సిడీపై అందించాలి..

నేలకొండపల్లి: రైతులకు అన్ని రకాల విత్తనాలను సబ్సిడీపై అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ నాయకుడు కాశిబోయిన అయోధ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున్న వచ్చే నెల మొదటి వారంలోనే విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు అమ్మే దుకాణాలపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టాలని కోరారు. అలాగే ఉపాధి హామీ పథకం కూలీలకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే అందించాలని, ఉపాధి పనులు రైతుల పొలాల్లో చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఖమ్మంమయూరిసెంటర్: 2024-25 నూతన విద్యా సంవత్సరం మరో నెల రోజుల్లో ప్రారంభం కాబోతున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.క్రాంతి, జి.మస్తాన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు, ఏక రూప దుస్తులు సకాలంలో అందజేయాలని, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు మంజూరు చేయాలని, ప్రభుత్వ వసతిగృహాల్లో సౌకర్యాలను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా నాయకులు గోపి, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతి